క్లుప్తంగా

గ్రామాల్లో అవగాహన



అవగాహన కల్పిస్తున్న సంస్థ సభ్యులు

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి, మల్లాపూర్, లక్ష్మణచాంద గ్రామాల్లో స్మార్ట్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం అయోడిన్ లోపంతో కలిగే నష్టాలను కళాకారులు ప్రజలకు అవగాహన కల్పించారు. మనం తీసుకునే ఆహారంలో అయోడిన్ లోపం ఉంటే మందబుద్ధి, శారీరక ఎదుగుదల లోపిస్తుందన్నారు. గాయిటర్, థైరాయిడ్ రుగ్మతలు వస్తాయన్నారు. గర్భిణులు, బాలింతలు సీ విటమిన్‌తోపాటు చేపలు, రొయ్యలు, ఆకుకూరలను ఆహారంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కోఆర్డినేటర్ మునగాల హుస్సేన్, ఔట్ రీచ్ వర్కర్ గంగుల శివశంకర్, నిర్మల్ ఏఎంసీ వైస్‌చైర్మన్ ఈటెల శ్రీనివాస్, హెచ్‌ఈవో హరికుమార్, ఆశ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

21న లెనిన్ శత వర్ధంతి సభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 21న నిర్వహించే కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య కోరారు. గురువారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం ఆవరణలో సభ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాంలక్ష్మన్, బక్కన్న, అంకుశ్‌రావు, రాజన్న, నారాయణ, గోరెమియా, లచ్చన్న తదితరులు ఉన్నారు.

పంట నష్టం పరిశీలన



పరిశీలిస్తున్న అధికారులు

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామంలో సాయన్న అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంటను అడవిపందులు ధ్వంసం చేయగా గురువారం అటవీశాఖ అధికారులు పరిశీలించారు. బాధిత రైతు విజ్ఞప్తి మేరకు ఎఫ్‌బీవో సంతోష్, ఏఈవో పవిత్ర, పంచాయతీ కార్యదర్శి రాజుతో కలిసి చేను వద్దకు వెళ్లి వివరాలు నమోదు చేసుకున్నారు. నష్టం అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

వ్యసనాలకు దూరం ఉండాలి



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

సారంగాపూర్: గంజాయి, జూదం వంటి వ్యసనాలకు దూరం ఉండాలని కళాజాత ప్రదర్శన బృందం ప్రతినిధి ఎలిశెట్టి సుదర్శన్ అన్నారు. మండలంలోని జామ్ గ్రామంలో గురువారం రోడ్డు ప్రమాదాల నివారణ, గంజాయి దుష్పరిణామాలు, జూదం నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన చేశారు.

వివేకానంద ఆవాసానికి విరాళం

భైంసాటౌన్: పట్టణంలోని స్వామి వివేకానంద అనాథ పిల్లల ఆవాసానికి భైంసాకే చెందిన అగ్రికల్చర్ విశ్రాంత ఏడీ సర్కుట్లవార్ రఘునాథ్ రూ.5వేలను విరాళంగా అందించారు. గురువారం ఆవాసం సందర్శించి తన సోదరి విజయలక్ష్మి జ్ఞాపకార్థం విరాళం అందించినట్లు పేర్కొన్నారు. దీంతో ఆవాస కమిటీ సభ్యులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

21న దుకాణాలకు వేలం

దిలావర్‌పూర్: మండలంలోని ప్రాచీన ప్రాశస్త్యం కల్గిన శ్రీ మాతాన్నపూర్ణ కదలి పాప హరేశ్వర ఆలయ ప్రాంగణంలో దుకాణ సముదాయాలకు ఈనెల 21వ తేదీన మంగళవారం వేలంపాట నిర్వహించనున్నట్లు ఈవో భూమయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో ఏడాది పాటు కొబ్బరికాయలు, ఇతర పూజాసామగ్రి, తినుబండారాలు విక్రయించేందుకు వేలంపాట నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి కలవారు రెండు దుకాణాలకు రూ.50 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.



పశువైద్యశాల వద్ద మురుగుకాల్వలో పూడిక



బస్టాండ్ ఎదుట గడ్డితో నిండిన కాలువ



వడ్డెర కాలనీ ఎదుట మురుగు కాలువ దుస్థితి

అధ్వానంగా పారిశుద్ధ్యం

- కుభీర్‌లో నిండిన మురుగు కాల్వలు
- పేరుకుపోయిన చెత్తకుప్పలు
- పొంచి ఉన్న రోగాల ముప్పు

కుభీర్: మేజర్ గ్రామపంచాయతీ అయిన మండలకేంద్రంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. కాలనీల్లో మురుగు కాల్వలను శుభ్రం చేయకపోవడంతో పూడిక, చెత్తాచెదారంతో నిండిపోయాయి. జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదుట, పశువైద్యశాల వద్ద చెత్తకుప్పలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. బస్టాండ్ వెనుక కాలనీ మురుగుకాల్వల్లో తీసిన పూడిక కుప్పలను తొలగించకపోవడంతో అవి మళ్లీ ఆ కాల్వల్లోనే పడుతున్నాయి. దీంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. నెల కిందట జాతర సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో పడేసిన ప్లాస్టిక్ కవర్లు, అట్టముక్కలు, వాటర్ బాటిళ్లను ఇప్పటికీ శుభ్రం చేయలేదు.



జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదుట పేరుకుపోయిన చెత్తాచెదారం

జాడ లేని ఈవో..

గ్రామపంచాయతీకి ఈవోగా పని చేస్తున్న ఈవో(ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్) కె.రాజేశ్వర్‌ను జిల్లా అధికారులు గత నెల 31న లోకేశ్వరం బదిలీ చేశారు. ఆయన స్థానంలో కుభీర్‌కు వేరే అధికారి రాకున్నా.. మండల అధికారులు రిలీవ్ చేశారు. కుభీర్‌లో ఆరుగురు పారిశుద్ధ్య కార్మికులున్నప్పటికీ వీధులను మాత్రం శుభ్రంగా ఉంచడం లేదు. నూతన ఈవోను నియమించి కుభీర్‌ను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

కాల్వలను శుభ్రం చేయాలి



శుభ్రం చేయకపోవడంతో గ్రామంలోని మురుగు కాల్వలు పూడికతో నిండిపోయాయి. చెత్తకుప్పలు పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇప్పటికైనా మురుగు కాల్వలను శుభ్రం చేశాలి. – ఉప్పు దత్తాత్రి, కుభీర్

ఇబ్బంది పడుతున్నాం



ప్రస్తుతం మేజర్ గ్రామపంచాయతీకి ఈవో లేరు. మా ఈవోను బదిలీ చేశారు. కానీ కొత్తగా ఎవరిని నియమించలేదు. జనన, మరణ, ఇతర ధ్రువీకరణ పత్రాలు తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్నాం. వెంటనే ఈవోను నియమించాలి. – జి.సంతోష్, కుభీర్

త్వరలో నియమిస్తాం

త్వరలో కుభీర్ మేజర్ గ్రామపంచాయతీకి నూతన ఈవోను నియమిస్తాం. మండలం నుంచి ఒక ప్రపోజల్ రాగా ఆయన అంగీకారం చెప్పనందున రద్దు చేశాం. త్వరలో మరో వ్యక్తిని ఈవోగా నియమిస్తాం. – ఆకుల శ్రీనివాస్, డీపీవో

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతి అందిస్తున్న మున్సిపల్ చైర్మన్

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 11న ప్రారంభమైన కేపీఎల్ సీజన్-3 క్రికెట్ టోర్నీ విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి పవర్ పాంథర్స్ జట్టుకు ట్రోఫీ, రూ.15వేలు అందజేశారు. ద్వితీయస్థానంలో నిలిచిన చిరుత జట్టుకు రూ.10వేలు, ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోష్, సురేశ్, మహేందర్, రాజశేఖర్, సుమిత్, డాక్టర్ కిరణ్, సలీంఖాన్, శరత్, ప్రకాశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు. ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్–బాదనకుర్తి ప్రధాన రహదారి పక్కన బాదనకుర్తి మాజీ ఎంపీటీసీ గుడాల రాజన్న ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఛత్రపతి యువసేన జట్టుకు రూ.4వేలు, ట్రోఫీ, ద్వితీయ బహుమతి రాయల్ టైగర్స్ జట్టుకు రూ.2వేలు ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



పోశెట్టిని సన్మానిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలు

సోన్: ఇటీవల నిర్మల్‌లో జరిగిన ఆర్ఎంపీ, పీఎంపీల కమిటీ ఎన్నికలో జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని కడ్తాల్ గ్రామానికి చెందిన లైశెట్టి పోశెట్టి ఎన్నికయ్యారు. గురువారం సోన్‌లో ఆర్ఎంపీ, పీఎంపీలు పోశెట్టిని శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా పోశెట్టి మాట్లాడుతూ ఆర్ఎంపీలు, పీఎంపీల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో భూమేశ్, రమేశ్‌యాదవ్, మల్లేశ్, ప్రభాకర్, సంతోష్, మనోహర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో పూజలు



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. వివిధ మండలాల నుంచి మహిళలు పాదయాత్రగా ఆలయానికి చేరుకుని బాబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

గోపాలమిత్రలకు సమాచారమివ్వాలి

నర్సాపూర్(జి): పశువులు ఎదకు వచ్చినప్పుడు గోపాలమిత్రలకు సమాచారం ఇవ్వాలని పశువైద్యాధికారి డాక్టర్ హైమద్ అన్నారు. మండలంలోని తిమ్మాపూర్ (జి) గ్రామంలో గురువారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఎదకు వచ్చిన పశువుల్లో కృత్రిమ గర్భధారణ చేయిస్తే మేలు రకం సంతానోత్పత్తి కలుగుతుందని పేర్కొన్నారు. శిబిరంలో 26 పశువులకు గర్భకోశ చికిత్సలు, 43 దూడలకు నట్టల నివారణ టీకాలు వేయించినట్లు పశు వైద్యాధికారి వివరించారు.

ఏడాదికే దెబ్బతింటున్న రోడ్డు

- గుంతలమయంగా వానల్‌పాడ్–సుంక్లి బీటీ రోడ్డు

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామం నుంచి సుంక్లి మీదుగా లింబా గ్రామం వరకు నాలుగు కిలోమీటర్ల మేర నిర్మించిన బీటీ రోడ్డు ఏడాదికే గుంతలమయంగా మారింది. ఏడాదికే తారులేచి కంకరతో దర్శనమిస్తుండటంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బంది ప డుతున్నారు. ఇప్పటికైనా క్వాలిటీ సెల్ అధికారులు రోడ్డును పరిశీలించి సంబంధిత కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని సుంక్లి గ్రామస్తులు కోరుతున్నారు.



దెబ్బతింటున్న రోడ్డు

గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తా

దిలావర్‌పూర్: నియోజకవర్గంలోని గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తానని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సిర్గాపూర్ గ్రామంలో ఉపాధి నిధులు రూ.20లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. మాయాపూర్ పంచాయతీ పరిధిలోని వడ్డేపల్లిలో వడ్డెర సంఘ భవనానికి నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే నల్లా ఇంద్రకరణ్‌రెడ్డి, రావుల రాంనాథ్, మెడిసెమ్మ రాజు, సత్యం చంద్రకాంత్, రాజేశ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.



సిర్గాపూర్‌లో పనులు ప్రారంభిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

నానూమహరాజ్ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

సారంగాపూర్: మండలంలోని బండ్రేవుతండాలో కొలువైన నానూమహరాజ్ ఆలయాన్ని గురువారం నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి దర్శించుకున్నారు. పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేకు తీర్థప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు దాతల సాయం

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్ గ్రామానికి చెందిన కె.నాగలక్ష్మి అంతర్జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైంది. గతంలో రూ.12వేలతో కిక్ బాక్సింగ్ కిట్ అందించిన ఓకేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఒడ్డెపల్లి కృష్ణంరాజు గురువారం రూ.5వేలను ఖానాపూర్ బస్టాండ్ సమీపంలో అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

కడెం: మండల కేంద్రానికి చెందిన సయ్యద్ ఫర్హాన్ అండర్–14 విభాగంలో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. గురువారం బీసీ యూత్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొదాని రమణాయాదవ్ కడెంలో ఫర్హాన్‌కు రూ.4 వేలను సాయంగా అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, క్రీడాకారులు తదితరులున్నారు.

దౌనెల్లిలో సర్వే బహిష్కరణ

కుంటాల: ప్రజాసంక్షేమ పథకాల అమలుకు మండలంలోని దౌనెల్లిలో అధికారులు నిర్వహించిన సర్వేను గ్రామస్తులు బహిష్కరించారు. గురువారం ఆర్ఐ రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి సాయేందర్, జూనియర్ అసిస్టెంట్ ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై సర్వే నిర్వహించారు. ప్రజాపాలన గ్రామసభలో ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ పేర్లు రాలేదని సర్వేను బహిష్కరించారు.. అధికారులను నిలదీశారు. అర్హులందరికీ న్యాయం చేస్తేనే సర్వేకు సహకరిస్తామని తేల్చిచెప్పారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్ గ్రామానికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. అర్హులకు రేషన్‌కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పడంతో శాంతించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అర్హులకు న్యాయం చేయాలని కోరుతూ గ్రామస్తులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. దిలీప్‌కుమార్, షేక్ హైమద్, శ్రావణ్‌కుమార్, చింతల నరేందర్, సమీ, సల్మాన్, సాయన్న, నారాయణ తదితరులు ఉన్నారు.



గ్రామస్తులకు నచ్చచెబుతున్న తహసీల్దార్ అహ్మద్‌ఖాన్

ఆలయ నిర్మాణం కోసం వినతి

భైంసారూరల్: కుభీర్ మండలంలోని రంజని గ్రామంలో జగదంబా సేవాలాల్ ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గురువారం గ్రామస్తులు దేగాం గ్రామంలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని గ్రామస్తులు తెలిపారు. వినతపత్రం అందించిన వారిలో మాజీ జెడ్పీటీసీ శంకర్ చౌహాన్, మాజీ సర్పంచ్‌లు బాలాజీ, దేవేందర్, జైవంత్, రాజేశ్వర్, దిగంబర్, మోహన్, గజానన్‌నాయక్, అర్జున్‌నాయక్, బావురావ్, మారుతి, మధుకర్, రాంనాయక్, రాందాస్ తదితరులు ఉన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లి, లక్ష్మణచాంద గ్రామాల్లో రైతుభరోసా సర్వేను వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారులు సంయుక్తంగా చేపట్టారు. ఈసందర్భంగా సాగుకు యోగ్యం కాని భూముల వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జానకి, ఏఈవో పవిత్ర, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని జౌలా(కే) గ్రామంలో జరుగుతున్న సర్వేను గురువారం తహసీల్దార్ లింగంమూర్తి, ఎంపీడీవో అబ్దుల్ సమద్ పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజాపాలనలో అందించిన దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారుల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: ప్రజాసంక్షేమ పథకాల అమలు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ శివరాజ్, ఎంపీడీవో సునీత అన్నారు. గురువారం మండలంలోని సత్తనపల్లి, సేవ్యానాయక్ తండా, తర్లపాడ్ గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపికకు చేపట్టిన సర్వేను పరిశీలించారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా లబ్ధిదారుల వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. వారి వెంట ఎంపీవో రత్నాకర్ రావు, పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.



తానూరు: వివరాలు తెలుసుకుంటున్న అధికారి



గొల్లమాడలో సర్వే చేస్తున్న సిబ్బంది

నర్సాపూర్(జి): రైతుభరోసా పథకానికి అర్హులను ఎంపిక చేసేందుకు మండలంలోని గొల్లమాడ, నందన్, అంజనితండా గ్రామాల్లో అధికారులు సర్వే నిర్వహించారు. సాగుకు యోగ్యం కాని భూముల వివరాలను నమోదు చేసుకున్నారు. వేణుగోపాల్, పుష్పలత, సర్వేయర్ మోహన్ కృష్ణ, ఏఈఓలు చంద్యాల గణేశ్, భాగ్యలక్ష్మి, రమ్య, కార్యదర్శులు సంధ్యారెడ్డి, సంస్కృతి, వెంకటేశ్ ఉన్నారు.

విలీన సభకు తరలిరావాలి

ఖానాపూర్: కొత్తగూడెంలో ఈనెల 18న జరిగే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర విలీన సభ పోస్టర్‌ను గురువారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతిభవనంలో ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్ మాట్లాడారు. కార్మికోద్యమ నిర్మాణం, విస్తరణ కోసం నిర్వహించే విలీన సభను జయప్రదం చేసేందుకు కార్మికులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దుర్గం లింగన్న, రాములు నాయక్, జేవింద్ తదితరులు ఉన్నారు.

వాలీబాల్ పోటీలు

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ పంచాయతీ పరిధిలోని దర్యాపూర్‌లో అనంతుల సతీశ్, జాదవ్ సంజీవ్‌ల జ్ఞాపకార్థం వారి స్నేహితులు గురువారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.3వేలు, రెండో బహుమతిగా రూ.2 వేలతోపాటు ట్రోఫీ అందించినట్లు దాత గుండోజి గణేశ్ తెలిపారు. ఎస్సై సాయికిరణ్, మాజీ సర్పంచ్ గోవింద్‌రెడ్డి, కార్యదర్శి నవనీత్‌కుమార్, ప్రవీణ్, అర్జున్, రమేశ్ పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

నిర్మల్‌చైన్‌గేట్/లక్ష్మణచాంద: లక్ష్మణచాంద మండలం చామన్‌పల్లి గ్రామానికి చెందిన అంబల్ల గంగాధర్ అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలిసి ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి.. మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.రెండు లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించి గురువారం తన క్యాంపు కార్యాలయంలో గంగాధర్ కుటుంబసభ్యులకు అందించారు. లక్ష్మణచాంద మాజీ సర్పంచ్ ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

జాతరకు ముస్తాబైన ఆలయం

- నేటి నుంచి మహాలక్ష్మి దేవాలయంలో జాతర

తానూరు: మండలంలోని మొగ్లి గ్రామంలో మహాలక్ష్మి ఆలయం జాతరకు ముస్తాబైంది. వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నుంచి రెండు రోజులపాటు నిర్వహించే ఉత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటిరోజు సాయంత్రం గ్రామంలో మహాలక్ష్మి, పోచమ్మ ఆలయంలో బోనాలను నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం మహాలక్ష్మి అమ్మవారి ప్రతిమను రథంలో ఉంచి వీధుల్లో శోభాయాత్ర నిర్వహిస్తారు. శనివారం ఉదయం మహాలక్ష్మి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం మొక్కులు తీర్చుకుంటారు. జాతరకు మండలంతో పాటు మహారాష్ట్ర గ్రామాల భక్తులు తరలివస్తారు.

అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు..

శనివారం మధ్యాహ్నం ఆలయ కమిటీ, గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అంతరాష్ట్ర కుస్తీపోటీలు నిర్వహిస్తారు. ప్రథమ బహుమతి రూ.7,051, వెండి కడియం, ద్వితీయ బహుమతిగా రూ.5,051 వేలు అందించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వివరించారు. పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.




మహాలక్ష్మి ఆలయం

జైపాల్‌రెడ్డి జయంతి

సారంగాపూర్: మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో గురువారం మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సారంగాపూర్, నిర్మల్ ఏఎంసీ చైర్మన్లు హాదీ, భీమ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి మల్లారెడ్డి, మండల నాయకులు, తదితరులు ఉన్నారు.

ఆలయంలో పూజలు..

సారంగాపూర్ మండలంలోని బండ్రేవుతండాలో కొలువైన నానూమహరాజ్ ఆలయంలో గురువారం డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసరాల్లో క్రికెట్, కబడ్డీ పోటీలను నిర్వహించగా.. కబడ్డీ పోటీల్లో విజేతగా నిలిచిన జట్టుకు శ్రీహరిరావు రూ.12వేల నగదు బహుమతి అందజేశారు.



నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

కుక్కల బెడద అరికట్టరూ..

నర్సాపూర్(జి): మండలకేంద్రంలో రోజురోజుకూ వీధికుక్కల బెడద ఎక్కువవుతుంది. వీటి సంతానం పెరుగుతుండటంతో ఏ యే వీధిలో చూసినా శునకాల సమూహమే కనిపిస్తోంది. దీంతో రోడ్లపై రాకపోకలు సాగించేందుకు విద్యార్థులు, ప్రజలు జంకుతున్నారు. గ్రామసింహాలు ఇప్పటికే పలువురిపై దాడి చేస్తున్నాయి. రాత్రి కుక్కలు ఒకచోట గుంపుగా చేరి అరుస్తుండడంతో నిద్ర సైతం సరిగా ఉండటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయితీ అధికారులు స్పందించి కుక్కల బెడద నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వీధిలో తిరుగుతున్న కుక్కలగుంపు